క్లుప్తంగా

భక్తప్రహ్లాద పద్యనాటకం రేపు

మద్రిపాలెం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ నెల 14న స్థానిక సీతారామ కల్యాణ మండపంలో భక్తప్రహ్లాద పద్య నాటకాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి చౌదరి అప్పారావు అధ్యక్షత వహిస్తారన్నారు. సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అడిషనల్ కమిషనర్ కింజారపు ప్రభాకర్‌రావు, రిటైర్డ్ జడ్జి గంట అప్పలనాయుడు, రిటైర్డ్ ఇంజినీర్ సత్యనారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గోవాలని కోరారు.

నేడు అన్నప్రసాద వితరణ

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం నారాయణ సేవ నిర్వహిస్తామని ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాదం అందిస్తామని, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

స్పాట్ అడ్మిషన్లకు విశేష స్పందన



శంకరమఠంలో జరుగుతున్న స్పాట్ అడ్మిషన్లలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: శ్రీకంచి కామకోటి పీఠాధిపతి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థల్లో ప్రవేశాలకు శనివారం శంకరమఠంలో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఏయే పాఠశాలలు, కళాశాలల్లో ఏయే కోర్సులు అందిస్తున్నారో వాటి వివరాలు, హాస్టల్ వసతి, విద్య అనంతరం ప్లేస్‌మెంట్ సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. సంస్థ కో ఆర్డినేటర్ లక్ష్మి మందాత కోర్సుల వివరాలు, స్కాలర్‌షిప్‌ల గురించి తెలియజేశారు. కృష్ణవేణి సుబ్రహ్మణ్యం, అశ్విన్‌కుమార్ అడ్మిషన్లు స్వీకరించారు. ఆదివారం కూడా స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతాయని వారు తెలిపారు.

పార్కిన్‌సన్స్ వ్యాధిపై అవగాహన నేడు

మురళీనగర్: వాకర్స్ హెల్త్ క్లబ్ వార్షికోత్సవంలో భాగంగా మురళీనగర్ సెక్టార్–8లోని హరిత పార్కులో ఆదివారం పార్కిన్‌సన్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిప్లా సౌజన్యంతో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పార్కిన్‌సన్స్ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై ప్రజలకు తెలియజేస్తారని పేర్కొన్నారు. వాకర్స్‌తోపాటు మురళీనగర్ వాసులు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవ వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి చైత్ర పూర్ణిమ సందర్భంగా శనివారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 6.45 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొన్న భక్తులతో మంగళధ్వని, వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేక ప్రదర్శన చేశారు. సన్నిదిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. పాలు, నెయ్యి, పంచదార, పెరుగు, తేనె, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం జరిపారు. ఉదయం బాల భోగం,శ్రీవారికి అర్చన, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, విష్ణు సహస్ర నామార్చన, రాజభోగ నివేదన చేశారు. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పించారు. ఆలయ ఈవో బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.రామారావుతో కలసి శనివారం విశాఖ రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. బిహార్ రాష్ట్రం నలంద జిల్లాకు చెందిన లక్ష్మణ్‌కుమార్ విశాఖపట్నం మీదుగా బిహార్‌కు గంజాయిని రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఇతడి వద్ద నుంచి రూ.45 వేల విలువైన 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.



శ్మశానవాటికలో దహన వాటిక



శ్మశానవాటికలో నిర్మిస్తున్న వెయిటింగ్ హాళ్లు, ఇతర భవనాలు

చివరి మజిలీకి తీరని చింత

- నత్తనడకన నక్కవానిపాలెం శ్మశానవాటిక అభివృద్ధి పనులు
- ఇంజినీర్ల సమన్వయ లోపమే కారణం
- రూ.1.90 కోట్ల నిధులు.. కొలిక్కి రాని పనులు
- దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు

సీతమ్మధార: జీవీఎంసీ 23, 24 వార్డుల్లో విస్తరించి ఉన్న నక్కవానిపాలెం శ్మశానవాటిక పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.1.90 కోట్లతో చేపట్టిన దీని అభివృద్ధి పనులు ఎప్పుడు ముగింపు దశకు చేరుకుంటాయని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జోన్–3లో ఇంజినీరింగ్ అధికారులు మారిన తరువాత పనులు మందగించాయని స్థానికులు విమర్శిస్తు న్నారు. ఇంజినీర్ల మధ్య సమన్వయ, పర్యవేక్షణ లోపాల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. ఈ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలను ప్రశాంతంగా జరుపుకోలేకపోతున్నామని మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో నిధుల కేటాయింపు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్మశానవాటిక అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు కేటాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా.. పనులు ఒక కొలిక్కి రావడం లేదు. జీవీఎంసీ కేటాయించిన నిధులతో ఈ శ్మశానవాటికలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నూతనంగా రెండు దహన వాటికల నిమిత్తం ప్లాట్‌ఫారాలు, రెండు వెయింటింగ్ హాళ్లు, కార్యాలయ గది, కాటికాపరి భవనం, ఒక శివాలయం, టాయిలెట్లు నిర్మిస్తున్నారు. వాచ్‌మన్ గదికి మరమ్మతులు చేస్తున్నారు. తలనీలాలు తీసే భవనంతోపాటు ప్లాట్‌ఫారం, లైట్లు తదితర పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయి.

70 ఏళ్లుగా దహన సంస్కారాలు

నక్కవానిపాలెం ప్రాంతంలో 70 ఏళ్ల నుంచి ఈ శ్మశానవాటిక ఉంది. 23, 24 వార్డుల్లోని నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, గాంధీనగర్, క్రాంతినగర్, మద్దిలపాలెం, టీపీటీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీ, నార్ ఎక్స్‌టెన్షన్, తులసీపేట, న్యూ రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, హెచ్‌బీ కాలనీ, తదితర ప్రాంతాల్లో చనిపోయిన వారి మృతదేహాలకు దహన సంస్కారాలు ఇక్కడే నిర్వహిస్తుంటారు.



నక్కవానిపాలెం శ్మశానవాటిక వద్ద నిర్మిస్తున్న ప్రధాన ద్వారం

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ప్రస్తుతం శ్మశానవాటికలో నాలుగు ప్లాట్‌ఫారాలు మాత్రమే ఉన్నాయి. వాస్తవానికి ఎనిమిది ప్లాట్‌ఫారాల అవసరం ఉంది. ఒకే రోజు అధిక మృతదేహాలు వస్తే దహన సంస్కారాలకు ఇబ్బందిగా ఉంటోంది. ఆరు నెలల కిందట కోటి రూపాయల వ్యయంతో పనులు ప్రారంభించారు. కొద్ది నెలలుగా పనుల్లో కొంత వరకు జాప్యం జరుగుతోంది. జోనల్ ఇంజినీర్ల నిర్లక్ష్యం వల్లే పనులు మందుకొడిగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి శ్మశానవాటికను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఇబ్బందులు ఇవే..

- ఈ శ్మశానవాటిక గతేడాది చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతుండేది. రాత్రయితే చాలు ఆకతాయి యువకులు, మందుబాబులు ఇక్కడ చేరి మద్య పానంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు. ఈ కారణంగా చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.
- పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో దహన సంస్కారాల నిమిత్తం వచ్చే వారు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.
- మృతుల సంఖ్యకు అనుగుణంగా ఇక్కడ ప్లాట్‌ఫారాలు అందుబాటులో లేవు. వాస్తవానికి ఇక్కడ మొత్తం ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండాల్సి ఉండగా.. నాలుగు మాత్రమే ఉన్నాయి.
- ఈ వాటికలో 2022లో నిర్మించిన రెండు షెడ్లు నిక్షేపంగా ఉన్నా సరే అభివృద్ధి పనులు పేరిట వాటిని కూల్చేశారు. సిబ్బంది వారించినా సరే కాంట్రాక్టర్ వినిపించుకున్న పాపాన పోలేదు.
- గతంలో ఇక్కడ ఎక్కువ కుళాయి పాయింట్లు ఉండటంతో ప్రజల స్నానాలకు సదుపాయంగా ఉండేది. కొంతకాలంగా టాయిలెట్ల వద్ద మాత్రమే కుళాయి పాయింట్ ఉన్న కారణంగా అందరూ అక్కడికే వచ్చి స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తమవుతోంది.
- సాధారణంగా దహనం చేసిన తరువాత ఐదు రోజుల వ్యవధిలో మాత్రమే అస్తికల కోసం ప్రజలు వస్తారు. ఇక్కడ లాకర్లు లేకపోవడంతో అస్తికలు భద్రపరచడం ఇబ్బందిగా మారిందని ప్రజలు, సిబ్బంది వాపోతున్నారు.
- ఇక్కడికి వెంటవెంటనే మృతదేహాలను తీసుకొస్తే దహన సంస్కారాలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.
- కేర్ టేకర్‌కు వేతనం లేకపోవడంతో మృతదేహాలను తెచ్చిన వారు ఇచ్చే తృణమో ప్రణమో తీసుకుని కుటుంబాన్ని పోషించాల్సి వస్తోందని కేర్ టేకర్ వాపోతున్నారు. శ్మశానం ఆవరణలో పశువుల బెడద అధికంగా ఉంటోందని సిబ్బంది వాపోతున్నారు.



నిర్మాణ దశలో శివాలయం

ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచాలి



శ్మశానవాటికలో గతంలో ఆరు దహన వాటికలు, రెండు షెడ్లు విడిగా ఉండేవి. ప్రస్తుతం నాలుగు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వారసత్వంగా 2008 నుంచి ఇక్కడ కాటికాపరిగా పనిచేస్తున్నాను. గతంలో తండ్రి గంగాధర్, బాబాయ్ నాగరాజు కాటికాపర్లుగా ఉండేవారు. రోజుకు సగటున రెండు దహనాలు జరుగుతాయి. నెలకు 30 వరకు దహన సంస్కారాలు చేస్తున్నాం. ఇక్కడ దహనాల కోసం వచ్చేవారు 97017 29164 నంబర్ ద్వారా సంప్రదిస్తే శ్మశాన వాటికలో అందుబాటులో ఉంటాను.

– రామారావు, కేర్ టేకర్, నక్కవానిపాలెం శ్మశానవాటిక

జై శ్రీరామ్.. జై హనుమాన్



శోభాయాత్ర బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మద్రిపాలెం: హనుమాన్ జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ దరి ఫెయిర్ ఫీల్డ్ మారియట్ హోటల్ వద్ద శనివారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వందలాది మంది భక్తులు జై శ్రీరామ్.. జై హనుమాన్ అంటూ బైక్ ర్యాలీలో పాల్గొన్నారన్నారు. హిందువుల్లో ఐక్యత కోసం పిలుపునిచ్చిన ర్యాలీకి విశేష స్పందన లభించింది. వందలాది మంది బైక్‌లపై మాధవధార, మురళీనగర్ మీదుగా బీచ్ రోడ్డులో జరిగిన హనుమాన్ విజయోత్సవ శోభాయాత్రలో పాల్గొన్నారు.



హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న మురళీనగర్ వాసులు

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు, రామాలయం కమిటీ, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మురళీనగర్ రామాలయం వద్ద యాత్రను నిర్వహణ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్ భక్తులతో కలిసి ప్రారంభించారు. అక్కడి నుంచి నగరంలోని ప్రధాన ప్రాంతాల మీదుగా పార్కు హోటల్ వరకు ద్విచక్ర వాహనాలపై యాత్ర సాగించారు. హనుమాన్ చాలీసాతోపాటు భజనలతో మాధవధార భజన మండలి సభ్యులు, భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, స్థానిక నాయకులు జె.పృథ్వీరాజు, సంకు వెంకటేశ్వరరావు, ఎస్.నరసింహస్వామి, కూన వెంకటరావు, పీవీవీ సూర్యనారాయణరాజు, ఎస్.రామకృష్ణ, చక్రవర్తి, భాను ప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి సహాయ సహకారాలు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గెజిటెడ్ అధికారులు

సీతంపేట: దళితుల అభ్యున్నతి కోసం ఎస్సీ గెజిటెడ్ అధికారులు సహాయ సహకారాలు అందించాలని రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన ఉత్తరాంధ్ర ఎస్సీ గెజిటెడ్ ఆఫీసర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఎస్సీ యువకులకు ప్రభుత్వ పథకాలు, దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన లేకపోవడంతో పథకాలు చేరడం లేదన్నారు. ఎస్సీ అధికారులు సెలవు రోజుల్లో గ్రామాల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. మరో వక్త సూపరింటెండెంట్ ఇంజినీర్ విజయానందు మాట్లాడుతూ నిన్నటి వరకు ఆగిపోయిన పథకాల అమలుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం సంతోషకరమన్నారు. నిరుద్యోగులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళిత సంఘాల నాయకులు యువతకు చేయందించాల్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.జ్ఞానవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పురుషోత్తం, కె.సురేష్, శంకరయ్య, రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, లోకల్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ సభ్యులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను పలువురు వక్తలు మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, విశాఖపట్నం లోకల్ సెంటర్ చైర్మన్ డాక్టర్ కె.వి.రామమోహనరావు, సెక్రటరీ డాక్టర్ సిహెచ్.సురేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ప్రతినిధులు

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శనివారం చైత్రమాస బహుళ పూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాలరాజు(కృష్ణ) ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ నేతృత్వంలో స్వామికి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామ విభూది పుష్పాలతో అర్చనలు చేశారు. మాలధారులు శూలాలు వేసుకుని వేల్‌వేల్ మురుగన్ అంటూ రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊర్వశి కూడలి నుంచి జాతీయ రహదారిలో ప్రారంభమై కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన మీదుగా మహా రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం జాతరలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: ఇంటర్మీడియట్ ఫలితాల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎంపీసీ ఫస్టియర్‌లో ఎస్.హరిణి 449 మార్కులు, సత్య సంతోషి హర్షిణి 442, బైపీసీ విభాగంలో రేష్మ ప్రియ 411, సీఈసీ విభాగంలో సజియ 467, ఎంఈసీ విభాగంలో డి.ఎస్.సిద్ధార్థవదన్ 412 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో పి.సౌందర్య 981 మార్కులు, కె.జ్యోత్స్న, జి.లక్ష్మి 980 మార్కులు, బైపీసీలో ఎస్.కావ్యశ్రీ 951 మార్కులు, ఎస్.హేమంత్ ఈశ్వరి 950 మార్కులు, ఎం.ఆశాదివ్య 926 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం వీరిని బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి అభినందించారు.



బుల్లయ్య కళాశాల విద్యార్థినులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

ఎస్ఎంసీ హైస్కూల్ ప్లస్ విద్యార్థుల విజయకేతనం

సీతమ్మధార: సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని జీవీఎస్‌ఎంసీ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఫస్టియర్ 33 మంది, సెకండియర్ 23 మంది.. మొత్తం 56 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎం.సంజన ఎంపీసీలో 462/470 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. కె.నాగభూమిక 442/470 (ఎంపీసీ), జె.సాహితి 422/470, బైపీసీలో బి.మల్లేశ్వరి 403/440 మార్కులు సాధించి ప్రతిభ చూపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 13 మంది, సెకండియర్‌లో 8 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు హెచ్‌ఎం డి.రాంప్రసాద్ స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో విద్యార్థినులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అభినందనలు తెలిపి బహుమతులు అందజేశారు.

వైభవంగా హనుమజ్జయంతి



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి

సీతమ్మధార: సీతమ్మధారలోని పలు ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో సింధూరం, తమలపాకులతో పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2 లక్షల విరాళం



దాత వసంతరావుకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్



సూపరింటెండెంట్ విక్రమ్‌కు చెక్కు అందిస్తున్న దాత మహదేవ్ శ్రీధర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని మధురవాడకు చెందిన దరువూరి వసంతరావు లక్ష రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌ని అందజేశారు. అక్కయ్యపాలెంలోని అబిద్‌నగర్‌కి చెందిన మహదేవ్ శ్రీధర్ లక్ష 116 విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.

ఈస్టర్ పండగకు వాల్తేర్ సెమెట్రీ సిద్ధం

మహారాణిపేట: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈస్టర్ పండగను ఈ నెల 20వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు వాల్తేర్ సెమెట్రీ అధ్యక్షుడు జార్జి చీడి తెలిపారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సిమెట్రీలోని 30 నుంచి 40 టన్నుల వరకు ఉన్న వ్యర్థాలను లారీల ద్వారా బయటకు తరలించినట్లు చెప్పారు. క్రైస్తవులు వారి ఆత్మీయుల సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహించుకోవడానికి , సమాధులను అలంకరించడానికి వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 20వ తేదీ ఉదయం 5 గంటల నుంచి బీజెడ్ లూథరన్ చర్చి క్వాయిర్ క్రైస్తవ భక్తి గీతాలను ఆలపిస్తారని ఆయన తెలిపారు. సమావేశంలో సెమెట్రీ కార్యదర్శి జి.మాథ్యూ పీటర్, కోశాధికారి జార్జ్ పులెట్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా రాష్ట్ర స్థాయి నాటక పోటీలు



మతమా.. మానత్వమా నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం రాష్ట్ర స్థాయి నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు రెండు ప్రదర్శనలు ఆసక్తికరంగా సాగాయి. అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్మాలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, మిశ్రో, నెక్కంటి సీతారామచంద్రమూరిలు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు.

ఎస్.కె.మిశ్రోకు ‘రంగస్థల కళాభారతి’ పురస్కారం

నటుడు, నాటక రచయిత, దర్శకుడు ఎస్.కె.మిశ్రోకు రంగస్థల కళాభారతి బిరుదు పురస్కారం అందజేశారు. మిశ్రో దంపతులకు శాలువా కప్పి, పూలమాలలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. రూ.10 వేల నగదు బహుమతిని అతిథులు అందజేశారు. అనంతరం మిశ్రో మాట్లాడుతూ ఇలాంటి సత్సంప్రదాయం పాటిస్తున్న విశాఖ మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ బిరుదుతో సత్కరించినందుకు ఆనందంగా ఉందన్నారు.

ఆలోచింపజేసిన నాటక ప్రదర్శనలు

నాటక పోటీల్లో మొదటి నాటకంగా చైతన్య కళాశాల ఉక్కునగరం వారి సమర్పణలో ‘అసత్యం’ ప్రదర్శించారు. రెండో నాటకంగా ప్రదర్శించిన ‘మతమా.. మానవత్వమా’ అందరినీ ఆలోచింపజేశాయి. అనంతరం దర్శకులకు, రచయితకి ప్రదర్శన పారితోషకం, ప్రశంసాపత్రాలను ముఖ్య అతిథులు అందజేశారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన

సీతమ్మధార: రాజ్యాంగానికి విరుద్ధంగా భారత పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని చేయడాన్ని, దానిని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని బలవంతంగా పార్లమెంటులో ఆమోదింపజేసుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మెజారిటీ ఉందన్న మదంతో ఈ బిల్లును పాస్ చేయడం దారుణమని ఆయన దుయ్యబట్టారు. వక్ఫ్ బోర్డుకు సంబంధించి అనేక మంది భక్తులు, ఆనాటి పాలకులు దేవుడి ధూప దీప నైవేద్యాల కోసం ఆస్తులను దానం చేస్తే, నేడు ఆ భూములకు సరైన పత్రాలు లేవనే సాకుతో ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ. విమల, ఎస్. కె. రెహమాన్, సి.ఎం. క్షేత్ర పాల్, పి. చంద్రశేఖర్, పడాల గోవింద్, పుష్ప ఆదినారాయణ, బి. రాము, ఏఎస్ఎఫ్ నాయకులు యు. నాగరాజు, ఎస్. హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.